# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- ❖ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు చేయూతనివ్వడమే “పీఎం ఫసల్ బీమా యోజన” పథకం ఉద్దేశ్యమని మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ కృత్రిమ మేథ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

==========================

ప్రజల సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ శాఖ అనునిత్యం పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, ప్రజల అర్జీలు, రెవెన్యూ శాఖలో సేవలు సులభతరం చేసేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు వివిధ అంశాలపై ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ నాటికి ప్రతి ఒక్కరికీ శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆదేశించారు. ఎన్డియే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 43.89 లక్షల మందికి కుల ధ్రువీకరణ ప్రతాల అందేజేశామని, మిగిలిన వారికి కూడా వీటిని అందించాలని ముఖ్యమంత్రి అన్నారు.

==========================

తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. ఈరోజు ఆయన ప్రకాశం జిల్లా నరసింహాపురంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకం ఇదేనని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 10 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీటిని అందించబోతున్నామన్నారు. ప్రస్తుతం “జల్ జీవన్

మిషన్” మొదటి విడత ఒక వెయ్యి 290 కోట్ల రూపాయలతో ప్రారంభిస్తున్నామని, సకాలంలో నిధులు వస్తే సుమారు 20 నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని నివారించడానికి 84 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

అల్లూరి సీతారామరాజు 128వ జయంతి పురస్కరించుకొని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 10 అడుగుల అల్లూరి కాంస్య విగ్రహాన్ని ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోని అల్లూరి అమరవీరుల స్మృతివనంలో జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. అల్లూరి అసువులు బాసిన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలాగే.. అనకాపల్లి జిల్లాను పర్యాటక వలయంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

========================

“ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన” పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఈ పథకానికి సంబంధించిన గోడ పత్రికను ఈరోజు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తుఫాను, కరవు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ పంట బీమా పథకం ద్వారా నష్టాన్ని అంచనా వేసి సాగు చేసిన రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేసి పరిహారం అందించనున్నామని పేర్కొన్నారు.

========================

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ ఎలైన్మెంట్, నరసాపురం బైపాస్ జాతీయ రహదారి ఏర్పాటు కోసం సేకరించిన భూముల సరిహద్దులను గుర్తించేలా స్తంభాలను ఏర్పాటు చేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రైల్వే, జాతీయ రహదారుల భవనాలు శాఖ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ లో రైల్వే లైన్, నరసాపురం బైపాస్ రోడ్డు భూ సేకరణ పురోగతిపై ఈరోజు ఆయన సమీక్షించారు. ఇప్పటివరకు సేకరించిన భూమి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

విరామం

========================

కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సలహాలు ఇస్తున్నామని చెప్పారు. భూములకు ఆధార్, సర్వే నంబర్ల అనుసంధానంతో సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు. గ్రీవెన్స్ ద్వారా వచ్చిన 4.63 లక్షల ఫిర్యాదుల్లో 3.99 లక్షల ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడించారు. ప్రతి భూమికి సంబంధించి సమగ్ర సమాచారం ఉండేలా చర్యలు తీసుకుంటామని, క్యూఆర్ కోడ్ తో కూడిన పాస్ పుస్తకాలు తీసుకువస్తున్నామని చెప్పారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే పూర్తి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

దేశవ్యాప్తంగా అమలవుతున్న వస్తుసేవల పన్నుల సరళిని పరిశీలించడానికి ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఈరోజు న్యూఢిల్లీలో సమావేశమైంది. గోవా ముఖ్యమంత్రి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనంతపురం కలెక్టర్ కార్యాలయం నుండి దృశ్యమాధ్యమం ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పలు రాష్ట్రాలు అమలు చేస్తున్న డేటా అనలిటిక్స్, ఎన్ఫోర్స్మెంట్ విధానాలు పంచుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. జీఎస్టీ డేటా యాక్సెస్ అన్ని రాష్ట్రాల ఇంట్రా స్టేట్ అండ్ ఇంటర్ స్టేట్ స్థాయిలోని సమాచారం లైవ్ గా యాక్సెస్ అందుబాటులో ఉంటే పన్ను ఎగవేతదారులను కట్టడి చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందని.. అలాగే పటిష్ఠమైన వ్యవస్థ ఏర్పడుతుందని రాష్ట్రం తరపున తెలిపినట్టు వెల్లడించారు.

==========================

చెరువులు, నీటి వనరులపై ఆక్రమణలను తొలగించాలని కర్నూలు జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆమె నీటి వనరులు, చెరువుల ఆక్రమణలకు సంబంధించి జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆదోని, కోసిగి, సి.బెలగల్, కోడుమూరులలో ఆక్రమణలను గుర్తించామని చెప్పారు. వాటర్ బాడీస్ ఆక్రమణలపై హై కోర్టులో పిల్ ఉందని, దీనికి సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదిక పంపాలని పేర్కొన్నారు. వాటర్ బాడీస్ లో గుడిసెలు, తదితర ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆక్రమణలకు సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఇన్ఛార్జి కలెక్టర్ సూచించారు.

==========================

రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈరోజు నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండలంలో ముదిగేడు – సంజామల మధ్య రహదారి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా డానిష్ ఆస్ఫాల్ట్ రీ-ఇన్ఫోర్సింగ్ టెక్నాలజీతో పైలెట్ ప్రాజెక్టు కింద 2 వరుసల రహదారులను నిర్మిస్తున్నామని తెలిపారు.

==========================

సామాన్యులు, రైతుల ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు సహకారం అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో ఈరోజు జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు అందించే రుణాలను సకాలంలో నవీకరించాలని, వారి పొదుపు ఖాతాలోని 50 శాతం సొమ్మును ఎఫ్.డి. చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు, ఎం.ఎస్.ఎం.ఈ. ఔత్సాహికులకు అండగా నిలవాలని సూచించారు. రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అవలంబించాలని, దరఖాస్తుదారులకు వీలైనంత త్వరగా స్పందన తెలియజేయాలని చెప్పారు. దరఖాస్తును తిరస్కరిస్తే దానికి గల కారణాలను దరఖాస్తుదారుకు తెలపాలని కలెక్టర్ సూచించారు.

==========================

బాధితులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర అన్నారు. ఈరోజు పార్వతీపురం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 47 వేల రూపాయల విలువైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

==========================
==========================